# సమీకరణాలు

ఆ ఊరి మిడిల్ స్కూల్లో హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్య ఉదయం తొమ్మిదింటికల్లా స్కూలుకెళ్ళడానికి తయారై ఇంట్లోంచి బయటకొచ్చి స్కూటర్ స్టార్ట్ చేశాడు.

"అన్నా... అన్నా... కొంచెం ఆగన్నా..." అంటూ కొంచెం దూరం నుండి అతని తమ్ముడు సోమయ్య పరిగెత్తుకొని రావడం కనిపించింది.

ఇంజన్ ఆఫ్ చేసి "ఇప్పుడు వీడెందుకొస్తున్నాడో" అనుకుంటూ స్కూటర్ మీదనే కూర్చొని తమ్మునికోసం ఎదురు చూడసాగాడు.

"అన్నా... అన్నా... బడికి పోతున్నవానె... ఓ గడియసేపు నా కోసం ఆగరాదె..." అన్నను సమీపిస్తూ అన్నాడు సోమయ్య.

"నేను ప్రేయర్‌కు అందుకోవాలె... టైమ్ లేదు. యేదన్నుంటే సాయంత్రం చెప్పు... ఇప్పుడు నన్ను పోనీయ్..." అన్నాడు ఈశ్వరయ్య.

"గడియసేపుండవే... నీ కాళ్ళు మొక్కుతా" అన్నాడు సోమయ్య.

"యేందో జల్దీ చెప్పు..." అన్నాడు ఈశ్వరయ్య రిస్టువాచీలో టైమ్ చూస్తూ-

అన్నదమ్ములు ఏం మాట్లాడుకుంటారో విందామని ఈశ్వరయ్య భార్య సునంద తలుపుచాటున నిల్చొని వాళ్లిద్దర్నీ గమనించసాగింది. సాధారణంగా ఆ తమ్ముడు ఈ అన్న దగ్గరకు ఎప్పుడూ రాడు. పదేళ్ళ క్రితమే వేరు పడ్డారు. ఎవరి సంసారాలు వారివి. పంచుకునేటప్పుడు భూముల దగ్గర గొడవ పడ్డారు. నౌకరీ ఉంది కాబట్టి ఈశ్వరయ్యకు భూముల్లో పాలు లేదన్నారు పెద్ద మనుషులు. నానా తంటాలు పడి పంపకాలు పూర్తిచేశారు. అప్పట్నించి అన్నదమ్ముల మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అలాంటి పరిస్థితుల్లో తన మరిది ఈరోజు ఇంత హడావిడిగా వాళ్ళ అన్న దగ్గరకు రావడం సునందను చాలా ఆశ్చర్యపరిచింది.

"రెండేళ్ళ నుండి కరవేగద... ఈ యేడాది పంటలు కొంచెం బాగానే పండినయి గదా... నా ఐదుపుట్ల వడ్లు ఇప్పుడు కళ్ళంల ఉన్నయి... వాటిని పేటకు తీసుకపోయి అమ్మి మెడకోణంగా మారిన కొన్ని అప్పులు తీరుద్దామనుకున్న... కాని మనూరి షావుకారి రంగయ్యొచ్చి ఇప్పుడు కళ్ళంల కూర్చున్నడు - యూరియా బస్తాల కోసం వాని దగ్గర ఐదేళ్ళ కింద మూడు వేలు దెచ్చిన. గాపాత బాకీ గాక మల్లోసారి విత్తనాల కోసం రెండువేలు దెచ్చిన. గాబాకీ కింద కళ్లంలున్న వడ్లు కొలువు అంటున్నడు".

"అయితే నన్నేం చెయ్యమంటవు?" అన్నాడు ఈశ్వరయ్య.

"నేను వాని దగ్గర తీసుకున్నది మొత్తం ఐదువేల రూపాయలే. మూడేళ్ళ కింద తీసుకున్న... ఇప్పుడు వడ్డీతోటి పదివేలయినయి అంటున్నడు... ఆ పదివేల కింద వడ్లు కొల్చుకపోతనంటున్నడు... వాడు పాత బాకీ కింద వడ్లు కొల్చుకపోతే నాకేం మిగుల్తయి? ఆర్నెల్లు రెక్కలు ముక్కలు జేసుకొని పడ్డ కష్టమంతా దండుగైపోతది..."

"అప్పు తీసుకున్నప్పుడు కట్టొద్దా? మూడేళ్ళ దాక యేం జేసినవు?"

"యేం జేస్తున్ననో నువ్వు చూస్తనే ఉన్నవు గదనే... ఎన్నడు అచ్చంగ పంటలు పండినయి? ఎప్పుడు జూసినా కరువేనాయె. బావుల్లసుత నీళ్ళే లేవాయే... తిండి మందం పండించుకునుడే గగనమైపాయే..."

"నీకు తిండి లేకుంటేంది? తాగుడుంటేచాలు... నాలుగు పైసలు చేతికొచ్చిన యంటే తాగి తందనాలాడ్తివి. నా అంతటోడు లేడని కాలరెత్తుకొని ఊరంత తిరిగితివి..."

"గదంత వెనకటెప్పుడో జేసినగని ఇప్పుడు గదంతేంలేదు... కాలమే నన్ను ముంచింది. నువ్విప్పుడు కళ్ళంకాడికొచ్చి గా షావుకారి రంగయ్యతోటి మా తమ్ముడు నీ బాకీ యాసంగి పంటల మీద తీర్పుతడని ఓ మాట చెప్పు... నువ్వు చెప్తే వాడు వింటడు... నీ తోడ బుట్టినందుకు నాకు గీ ఒక్క సాయం చెయ్యన్నా... నీ బాంచెనన్నా... నీ కాళ్ళు మొక్తనన్నా..." అంటూ సోమయ్య అన్న ఈశ్వరయ్య కాళ్ళు పట్టుకోబోయాడు –

"గీ ఫుజూల్ మాటలు నా దగ్గర మాట్లాడకు... నాకు స్కూలుకు టైమయింది – నేను పోతున్న" అంటూనే ఈశ్వరయ్య స్కూటర్ స్టార్ట్ చేశాడు. చేతులు జోడించి సోమయ్య స్కూటర్ కడ్డంగా నిల్చున్నాడు–

"నాకీ ఒక్క సాయం చెయ్యకపోతే నీ స్కూటర్ కిందపడి చస్త... నా శవం మీదినుంచి నీ స్కూటర్ పోనియ్యి" అన్నాడు.

"చస్తనని బెదిరిస్తున్నవా? ఎవని దగ్గర్నో అప్పుచేసి, బాగ తాగి, తిని తందనాలాడి ఆ అప్పులు తడిసి ముప్పందుం అయినంక నా దగ్గరకొస్తె నేనేం చెయ్యాలె..." అన్నాడు ఈశ్వరయ్య.

"గా రంగయ్య తోటి మా తమ్ముడు ఆరు నెల్లల్ల నీ బాకీ తీరుస్తడని నువ్వు చెప్పాలె..."

"అరునెల్లల్ల తీర్చకపోతె నువ్వు తీరుస్తవా అని వాడు నన్నడుగుతడు- యేం చెప్పమంటవు?"

"తీరుస్తనని చెప్పన్నా... యాసంగి పంటొచ్చినంక నేను వాని బాకీ తప్పక తీరుస్త. అవ్వతోడు. పాలకుర్తి సోమన్న మీద ప్రమాణం చెయ్యమంటె చేస్త".

"నువ్వేం ప్రమాణాలు చెయ్యొద్దు... అడ్డంలే... నన్ను పోనీయ్..." అరచినట్టుగా అన్నాడు ఈశ్వరయ్య.

"సాయంత్రం నువ్వు బడినుంచొచ్చినంక మల్లొస్త..." అంటూ సోమయ్య పక్కకు తొలిగాడు-

ఈశ్వరయ్య స్కూటర్ మీద కూర్చొని ఆ ఊర్లో ఉన్న ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలవైపుగా వెళ్ళిపోయాడు.

*　　　　*　　　　*

సాయంత్రం ఈశ్వరయ్య బడినుండి ఇంటికి రాగానే ఆ ఊరి పెద్దమనుషుల్లో ఒకడైన గాదెగాని యాదగిరి ఈశ్వరయ్య ఇంటిముందు నిల్చొని హెడ్‌మాస్టర్ కోసం ఎదురు చూస్తున్నాడు.

"ఈయనెందుకో వచ్చిండు? మా తమ్ముడే పంపించి ఉంటాడు. వీడు, వాడూ దోస్తులు గదా" అనుకుంటూ ఈశ్వరయ్య స్కూటర్ పార్క్ చేసి అతని వైపు చూశాడు.

"నమస్తే హెడ్‌మాస్టర్ సాబ్!" అన్నాడు యాదగిరి.

"నమస్తే యాదగిరి... ఎటో వస్తివి?" అన్నాడు ఈశ్వరయ్య.

"ఎటో ఎందుకొచ్చిన... మీ ఇంటికే వచ్చిన..."

"ఊరక రారు మహాత్ములు అంటరు గదా!"

"ఊరికనే రాలేదు... పనిమీదనే వచ్చిన... మీ తమ్ముడు మా అన్న దగ్గరికి పోయిరా అంటెనే వచ్చిన..."

"మా తమ్మునికి నాతోటేంపని... ఎప్పుడో పదేళ్ళ కింద వేరుపడ్డం... అప్పట్నించి ఇప్పటివరకు వాడొక్కసారి కూడా మా యింటికి రాలేదు- ఈ ఊర్లె వాడు నాకో పగోడుగ మారి ఎట్లనన్న నన్ను బద్‌నామ్ చెయ్యాల్నని చూసిండు... స్కూలుకు బిల్డింగ్ కట్టిచ్చినప్పుడు పైసలు తిన్ననని... 'మిడ్డేమీల్స్ స్కీం' పెట్టినప్పుడు బియ్యం, ఉప్పు, పప్పు కాజేసిన్నని... ఇట్ల నిష్కారణంగా నామీద బట్టకాల్చి

మీదేసిండు... గటువంటోడు ఇయ్యాళ నా ఇంటికొచ్చుడేంది? నన్నేదో సాయం చెయ్యమని అడుగుడేంది? ఊర్లె పెద్దమనిషివి, పంచాయితి బోర్డు మెంబర్‌వి, నువ్వే చెప్పు"

"చెప్పేటందుకే వచ్చిన గద... ఇంట్లకు రమ్మంటరా? బయటనే నిలబెట్టి మాట్లాడ్తవా?"

"పెద్ద మనిషివి వచ్చినవు గద... లోపల కూర్చుందాం రా"

ఇద్దరూ డ్రాయింగ్ రూంలోకెళ్ళారు. ఈశ్వరయ్య యాదగిరికి కుర్చీ చూపిస్తూ "కూర్చో" అన్నాడు. యాదగిరి కూర్చున్నాక ఈశ్వరయ్య అతనికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ఈశ్వరయ్యను చూస్తోంటే యాదగిరి కళ్ళల్లో సోమయ్య రూపం మెదిలింది. ఈశ్వరయ్య, సోమయ్యలు అన్నదమ్ములంటె కొత్తవాళ్ళు నమ్మలేరు. ఈశ్వరయ్య ఇస్త్రీ నలగని తళతళ మెరిసిపోయే పాంట్, బుషర్ట్ వేసుకొని చాలా దర్జాగా కనిపిస్తాడు. సోమయ్య వంటి మీదుండేవి ముతక బట్టలు... పైకి చెక్కి కట్టుకున్న ముతక ధోతి, అక్కడక్కడ చిరుగులు పడ్డ బనీను... తైల సంస్కారం లేక రెల్లుగడ్డిలా మారిన తలవెంట్రుకలు... మాసిన గడ్డం - ఎండకూ, వానకూ ఆలవాలమైన అతని శరీరంలో ఎలాంటి సౌకుమార్యం లేదు. అతని శరీరం ఓ బండరాయిలా మారిపోయింది. ఈశ్వరయ్య చాలా సుకుమారంగా కనిపిస్తాడు. అతని మొఖం ఎప్పుడూ గొప్పకాంతితో వెలిగిపోతుంటుంది. మెడలో బంగారు గొలుసు, వేళ్ళకు ఉంగరాలు చూడగానే ఇతడు చాలా ధనవంతుడన్న అభిప్రాయం కల్గుతుంది. ఈశ్వరయ్య బి.ఎ. దాకా చదివి బిఎడ్ కూడా చేసి మొదలు టీచర్‌గా చేరి, తర్వాత హెడ్‌మాస్టరయ్యాడు. పదిహేనేళ్ళుగా అతడు వాళ్ళూరికి చాలా దగ్గర్లో ఉండే స్కూళ్ళల్లోనే పనిచేస్తూ ఒకవైపు ఉద్యోగాన్ని, మరోవైపు వ్యవసాయాన్ని చాలా సమర్థవంతంగా నిర్వహించుకుంటూ ఆ ఊర్లోని సంపన్నుల్లో ఒకడుగా మారిపోయాడు. ఈశ్వరయ్య ఆ ఏరియా రాజకీయాల్లో కూడా చురుగ్గా పాల్గొంటూ "కింగ్ మేకర్" అన్న పేరు కూడా తెచ్చుకున్నాడు. అదే సోమయ్య నల్గురన్నదమ్ములు పంచుకోగా తన పాలుకొచ్చిన కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ ఆర్థికంగా చితికిపోతూ ఓ బక్కచిక్కిన రైతుగా మారిపోయాడు.

"చెప్పు యాదగిరి... యేంసంగతి?" అన్నాడు ఈశ్వరయ్య. అతడెందు కొచ్చాడో తెలుసు. అయినా తెలియనట్లే ఉండడం క్షేమం అనుకున్నాడు.

"ఎంత చెడ్డా మీరిద్దరు తోడబుట్టినోళ్ళే కదా. తమ్ముడు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం అన్నగా మీ ధర్మంకదా...!" మొదలెట్టాడు యాదగిరి.

"అన్న అనే గౌరవం వానికేనాడన్నా ఉండెనా? వేరుపడ్డప్పట్నించి వాడు యేనాడన్న "అన్నా!" అని నాదగ్గరికొచ్చిండా? నేనేదో వాని సొమ్ము తింటున్నట్టు నామీద ద్వేషం పెంచుకున్నడు. నేను చదువుకున్న... వాన్ని కూడ చదివిద్దాం అనుకున్న- కని వానికి చదువురాలేదు. బడి ఎగ్గొట్టి చెలక్కాడికి బోయి నాగలి దున్నెటోడు. వాని ధ్యాసంతా మా కులవృత్తి వ్యవసాయం మీదనే. నేను కష్టపడి చదుకున్న కాబట్టి నాకో సర్కార్ నౌకరి దొరికింది. అటు వ్యవసాయాన్ని, ఇటు ఉద్యోగాన్ని చూసుకుంటూ నేను బాగుపడ్డ... నేను కొంచెం తెల్లగ పుల్లగ కనబడేసరికి మా తమ్మునికి కండ్లు మండినయి. నా మీద ద్వేషం పెంచుకున్నడు. నా మీద బురద జల్లే ప్రయత్నం జేసిండు. పొత్తుల పైసలు బెట్టే నిన్ను చదివించినమని, మేం చదివిస్తేనే నీకు పంతులు నౌకరి దొరికిందని, నెలకు ఐదారువేలు సంపాదించు కుంటున్నవు కాబట్టి నీకు పొత్తుల ఆస్తిల పాలే లేదని పంచాయితి బెట్టిండు. మా పెద్దన్నలిద్దరు యేమనలేదు... ఎవని అదృష్టం వానిదే అని వాళ్ళు ఊరుకున్నరు... తోడబుట్టినోనికి పాలులేదంటే లోకం ఒప్పుకుంటదా అన్నరు... కని వీడు... నాకు ఒక్క గుంట భూమి కూడా ఇయ్యొద్దని, నౌకరి ఉన్నోనికి భూమెందుకని పెద్దలొల్లి జేసిండు. "అన్నల"తోటి చెప్పుతనని బెదిరించిండు. మా పెద్దన్నలిద్దరు పూర్వకాలపు మనుష్యులు కాబట్టి తోడబుట్టినోనికి పాలులేదనుడు ధర్మంకాదని గట్టిగ నిలబడ్డరు. నా పాలు నాకొచ్చింది. లేకపోతే యే కోర్టుకో బోయి నానా తిప్పలు పడేటోణ్ణి".

"గతం గతః అన్నరు... గడిచిపోయిందాన్ని గూర్చి ఇప్పుడెందుకు?... మీ పాలు మీకొచ్చింది గదా... మీరు బాగా పెట్టుబడి పెట్టి ఎందుకూ పనికిరావనుకున్న భూముల్ని బంగారం పండే భూములుగా మార్చుకున్నరు గదా... మీరొక దిక్కు నౌకరి చేసుకుంటనే వ్యవసాయం కూడా అదునెంబడి చేసుకున్నరు. వ్యవసాయం మీద స్వంత పెట్టుబడి పెట్టగల్గింద్రు. లాభం వచ్చే పంటలు పండించుకున్నరు. రెండు చేతులా సంపాదించింద్రు... ఇంత మంచి బంగ్లా కట్టుకున్నరు. ఇదే మీ తమ్ముడి పరిస్థితి చూడుండ్రి... మూడు పైసల వడ్డీకి అప్పుదెచ్చి పెట్టుబడి పెట్టిండు. ఓసారి పండితే రెండుసార్లు ఎండేపాయే... లాభసాటి వ్యవసాయం ఎట్లజెయ్యాల్నో తెలిసినోడు కాదాయె. తెచ్చిన అప్పు తెచ్చినట్టె ఉండె. పాపం పెరిగినట్టు వడ్డీ పెరిగిపాయె... రెక్కలు ముక్కలు జేసుకున్నా వానికేం గిట్టుబాటుకాదాయె... వాని పెండ్లాం, పిల్లలకింత తిండి పెట్టే పరిస్థితి లేకపాయె... ఒకప్పుడు బాగ బతికిన వాని పెండ్లం గిప్పుడు కూలి నాలికి పోబట్టె. మీ తోడబుట్టిన తమ్ముడు గిట్ల చెడిపోతాంటె మీరు చూసుకుంటెట్లుంటరు?..."

"దీనికెవ్వరు బాధ్యులు? ఇదంత వాడంతట వాడు చేసుకున్నదే గద! చేతుల కొన్ని పైసలు పడంగనే నా అంతటోడు లేడనుకొని తిని తాగి తందనాలాడి, రాజకీయాలల్లకు బాయె... ఓసారి మీ పార్టీ నుంచి సర్పంచ్‌కు పోటీ చేసి ఓడిపాయె... బోల్డు పైసలు పాడుచేసె... దరిద్రపు రాజకీయాలు వద్దురా అంటె వినడాయె... రెండోసారి వార్డుమెంబర్‌గ పోటీచేసి కూడా ఓడిపాయె... ఉన్నదంత నాశనం చేసుకునె... అదే మా ఇద్దరన్నల్ని చూడు... యే గొప్పలకు పోకుంట తమ పనేదో తాము చేసుకుంట గుట్టుగ బతుకుతున్నరు... వాళ్ళ భార్యలకు కూలినాలి చేసుకొని బతికే గతి పట్టలేదు".

"నిజమే హెడ్‌మాస్టర్‌గారూ! ఎవరి అదృష్టం వాళ్ళది... అదృష్టవంతుణ్ణి చెడగొట్టేటోళ్ళు లేరు, దురదృష్టవంతుణ్ణి బాగుచేసేటోళ్ళు లేరు అంటరు గదా... యేదైనా రాసిపెట్టినట్టు జరుగుతది. గదంత పోనీయుండ్రిగని గిప్పుడు మీ తమ్మునికి మీతోటో పనిపడ్డది..."

"ఆ పనేందో నాకెరికె... పొద్దున నేను స్కూలుకు పోయేటప్పుడు చెప్పిండు. గా విషయంల నేను చెయ్యగల్గేదేమీ లేదు."

"నేను చెప్పేది పూర్తిగా వినుండ్రి సార్! మీ తమ్మునికిప్పుడో పదివేల రూపాయల అప్పుగావాలె... ఊళ్ళె వానికెక్కడ పైసాకూడా పుట్టేటట్టు లేదు."

"నా దగ్గర కూడా పైసా పుట్టదు"

"ఉండుండ్రి సార్... చెప్పేది వినుండ్రి... మీ బంగ్లాకు ఎదురుంగనే మీ తమ్మునికి ఓ ఇల్లు కట్టుకోవడానికి సరిపోయేటంత జాగుంది. ఆ జాగ నాకమ్మితే బావుండునని మీరే రెండు మూడేళ్ళ కింద నాతోటన్నరు... పెద్ద బంగ్లా కట్టుకున్నగని ఇంటి ముంగల కాళీజాగ లేకుంటయిపోయిందని బాధపడ్డరు... ఇంటి ముందట ఖాళీ జాగ లేకపోవడం వల్ల మీ ట్రాక్టర్ మీ ఇంటి ముందరకొచ్చి ఆగే పరిస్థితి లేదు. దగ్గర్నించి సామాన్లని ఇంట్లకు తెచ్చుకోలేకపోతున్నరు. దీనికి నేనో ఉపాయం ఆలోచించిన."

"యేమిటో ఆ ఉపాయం?"

"మీ తమ్ముని జాగా రాయించుకొని ఇప్పుడతనికి మీరో పదివేల రూపాయలివ్వుండ్రి. ఓ యేడాదిలోపల మీరిచ్చిన పదివేల రూపాయలను వడ్డీతో సహా మీకు తిరిగి ఇవ్వకపోతే ఆ జాగా మీ స్వంతమైపోతుందని రాయించుకోండ్రి...

యేడాదిలోగా ఎన్ని తపస్సులు చేసినా అతడు మీ బాకీ తీర్చలేడు. ఆ జాగా మీకే అయితది..." అన్నాడు యాదగిరి.

"నేను వానికి పైసలిచ్చేది లేదు- వాడు నాకు జాగా ఇచ్చేది లేదు- గీ చిక్కులు నాకు పెట్టకు యాదగిరి... నన్నిట్ల బతకనీయ్..." అన్నాడు ఈశ్వరయ్య.

"అంత తొందర పడకుండ్రి, ఆలోచించుకోండ్రి... మీ ఇంటి ముంగట ఖాళీ జాగా లేక ఎన్ని ఇబ్బందులు పడ్తున్నరో ఈ ఊర్లె అందరికీ ఎరికే... రేపు నీ కొడుకు కారే కొనొచ్చు. కొడుకు కోడలు కార్లో వస్తే ఆ కారును ఇంటికి దూరంగా ఆపుకోవాల్సి వస్తది. ఇప్పుడు ట్రాక్టర్‌ను దూరంగా ఆపుకొని దాంట్లో తెచ్చుకున్న వడ్ల బస్తాలను బియ్యం బస్తాలను ఇంట్లకు చేర్చుకోవడానికి నానా తిప్పలు పడ్తున్నరు... ఇంటి ముందటి మీ తమ్ముని జాగాను మీరు మీ స్వంతం చేసుకున్నరంటే మీకీ ఇబ్బందులన్నీ తొలగిపోతయి... ఆలోచించుకోండ్రి... మీరిప్పుడు పైసలియ్యకపోతే ఇదే జాగాను ఇంకో దగ్గర కుదువబెట్టి అప్పు తెచ్చుకుంటడట... ఆ ఇంకోరెవరో మీకెరికేనా?"

"ఎవరట?"

"ఈ ఊర్లో మీకు ఎక్స్‌పార్టీగా ఉండే దొడ్డరామయ్య. మీ తమ్ముడు చక్కగ గాయన దగ్గరికే పోతడట... దొడ్డరామయ్యకెప్పట్నించో మీ ఇంటి ముందటి జాగా కాజేసి పెద్ద బంగ్లా కట్టుకోవాల్నని ఉంది"

"గట్లనా?... వాడు నా ఇంటిముందల్నే కొంప కట్టుకున్నడంటే నా పక్కలో బల్లెమున్నట్టే..."

"గందుకే చెబుతున్నగద... గింత మంచి అవకాశం మీకు మల్ల రాదు"

"నేను కొంచెం ఆలోచించుకొని చెబుత..."

"మీ తమ్మునికి పైసలకు చాలా అర్జెంటున్నది..." అన్నాడు యాదగిరి కుర్చీలోంచి లేచి నిలబడ్తూ.

"ఓ గంటాగిరా..." అన్నాడు ఈశ్వరయ్య.

"సరె"... అంటూ యాదగిరి బయటకెళ్ళిపోయాడు.

తలుపు చాటున నిల్చొని వాళ్ళ సంభాషణను జాగ్రత్తగా వింటున్న సునంద భర్త దగ్గరకొచ్చింది.

"యాదగిరి యేం చెబుతున్నడు"

"మా తమ్మునికి పదివేల రూపాయల అప్పుగావాల్నట"

"ఆయనకు పదివేలిస్తే మల్లొస్తయా?"

"మనింటి ముందట వానికి ఇంటి జాగుంది గద... దాన్ని మనకమ్మమని ఎంతమంది తోటో చెప్పిచ్చిన. నేనే అక్కడ ఇల్లు కట్టుకుంటనని వాడు దాన్ని అమ్మకుంట అట్లనే ఉంచుకున్నడు. ఇప్పుడు వాని దోస్త్ యాదగిరిని పంపిండు. వాని ఇంటి జాగను కుదవ బెట్టుకొని వానికి పదివేల అప్పియ్యాల్నట. యేడాదిలోపల వాడా అప్పు వడ్డీతో సహా తీర్చకపోతే ఆ ఇంటి జాగా మనకే అయితదట"

"ఇప్పుడట్లనే అంటడుగని తర్వాతెన్ని చిక్కులు పెడ్తడో"

"నేనూ అదే ఆలోచిస్తున్న... ఇప్పుడు మనం వానికి ఈ పదివేలు అప్పియ్యకపోతే మనూరి మాజీ సర్పంచ్ దొడ్డరామయ్య లేడూ... వాని దగ్గరికి పోతడట..."

"దొడ్డ రామయ్య దగ్గరికా... గాయన మన పగోడు"

"వానికి నా మీద పీకలదాకా పగుంది. నేను జెయ్యబట్టే వాడు రెండో సారి సర్పంచ్‌గ గెలవలేకపోయిండు గద. వానికి ఎప్పట్నించో మనింటి ముందున్న మా తమ్ముని ఇంటి జాగా మీద కన్నుంది. మనమిప్పుడు ఇంటి జాగాను కుదవబెట్టుకొని పైసలియ్యకపోతే వాడు దొడ్డరామయ్య దగ్గరికే పోతడట. ఇంటి జాగాను కుదవబెట్టుకొని పైసలియ్యమని అడుగుతడట... వీడెట్లాగూ యేడాదిలోపల ఆ అప్పు తీర్చలేడు... ఆ జాగా వానికే అయితది... మనింటి ముందట్నే మన మాజీ సర్పంచ్ మనకంటె పెద్ద బంగ్లా కడ్తడు... మన పక్కల బల్లెంగ తయారయితడు..."

"వాడిక్కడికొస్తే మనకు రోజూ వానితోటి పంచాయితే ఉంటది... వాడు మన తోటి గిచ్చి కయ్యంబెట్టుకుంటడు... మన దగ్గరికొచ్చే జనం... వాని దగ్గరికొచ్చే జనం కొట్లాటకు దిగుతరు... వాన్నిక్కడికి రానియ్యొద్దు"

"వాన్నిక్కడికి రానీయ్యొద్దనుకుంటే మా తమ్మునికి నేనిప్పుడు పదివేల రూపాయల అప్పియ్యాలే..."

"ఆ ఇంటి జాగా రాయించుకునే ఇస్తరు గదా..."

"అవును... రాయించుకునే ఇస్త... కని రేపు వాడెన్ని చిక్కులు పెడ్తడో... వాడు మొదలే చిక్కుల మారోడు... మాట మీద నిలిచెటోడు గాడు..."

"మాట మీద నిలవకపోతే ఊర్లె పెద్ద మనుషులు లేరా?"

"పెద్ద మనుషులు మాగున్నరు... యాదగిరి పెద్దమనిషే గద... రేపు యే సమస్యొచ్చినా నా భారమే అంటున్నడు..."

"యాదగిరి మాత్రం మాట మీద నిలబడ్తడంటరా?"

"పోనియ్‌గని ఈ విషయంల నీ అభిప్రాయమేమిటో స్పష్టంగా చెప్పు"

"మీ ఇష్టం... నేనేం జెప్పినా రేపు నన్నే అంటరు... ఎటుబోయి ఇటొస్తదో... మీ తమ్ముడో తాగుబోతోడు... వదురుబోతోడు.... వట్టి పుణ్యానికే మనతోటి ఎన్నోసార్లు పంచాయితి పెట్టుకున్నడు. ఆయన పెండ్లం పరమ గయ్యాలి... దాని నోటికి హద్దూ పద్దూ ఉండదు... వాళ్ళ జోలికి పోకుంటుంటెనే మంచిదేమొ!"

"అయితే ఆ ఇంటి జాగాను వదిలేసుకుందాం అంటవు. దొడ్డరామయ్య కిచ్చేద్దాం అంటవు. అంతేనా?"

"మీ ఇష్టమండి... తుది నిర్ణయం మీదే... ఇట్లాటి వ్యవహారాలు నాకేం తెలుసు?... మీ తమ్ముని ఇంటి జాగా మన స్వంతమైతే ఎంత బావుండును అని నేనెన్నోసార్లు కలలుగన్నా."

"ఆ కలను నిజం చేసుకునే అవకాశం వచ్చింది గదా"

"ఏమోనండి. చూడబోతే ముందు నుయ్యి... వెనుక గొయ్యి అన్నట్టుగా ఉంది... మీరే యేం చెయ్యాలో నిర్ణయించుండ్రి"

"మొత్తానికి ఎటూ చెప్పకుండా జాగ్రత్త పడ్తున్నవు. ఆడబుద్ధి పోనిచ్చుకున్నవు గాదు..."

* * *

ఆ మర్నాడే ఈశ్వరయ్య వాళ్ళ తమ్ముడు సోమయ్యకు పదివేల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. యాదగిరితోబాటు మరో ఇద్దరు ఆ ఊరి పెద్దమనుషులొచ్చారు. ఆ ఇద్దర్లో ఒకాయన ఆ ఊరి సర్పంచ్ వెంకటయ్య. యాదగిరి స్వయంగా అప్పు పత్రం రాశాడు. సంవత్సరంలోగా ఈ పదివేల రూపాయల్ని వడ్డీతో సహా ఈశ్వరయ్యకు చెల్లించకపోతే ఈశ్వరయ్య ఇంటి ముందున్న సోమయ్యకు చెందిన 4 గుంటల ఇంటి జాగా ఈశ్వరయ్య వశమౌతుందని రుణపత్రం రాశాడు. దానిమీద సోమయ్య సంతకం చేశాడు. సాక్షులుగా ఆ ఊరి ప్రస్తుత సర్పంచ్ గోనె వెంకటయ్యతోబాటు పంచాయితి బోర్డు వార్డు మెంబర్ యాకయ్య సంతకము చేశారు. ఆ ఊరి ప్రస్తుత సర్పంచ్ ఈశ్వరయ్యకు నమ్మినబంటు. అతడు సర్పంచ్‌గా ఎన్నిక కావడానికి ఈశ్వరయ్య ఆర్థికంగా, హార్థికంగా చాలా సహాయం చేశాడు. డబ్బు ఇచ్చేముందు ఈశ్వరయ్య రేపు వాడేమన్నా చిక్కులు పెడ్తే ఎట్లా అని వెంకటయ్యనడిగాడు.

"వానిబొంద. మనముందు వాడెంత? చిక్కులు పెడ్తే మెడలువంచి ఆ జాగా మనం ఆక్రమించుకుంటం... ఎక్కువ తక్కువ మాట్లాడితే కాళ్ళు చేతులు విరగ్గొట్టి మంచంల పడేద్దాం... మల్ల మంచం మీంచి లేవకుంట చేద్దాం" అన్నాడు వెంకటయ్య. ఊరి సర్పంచ్ తనవైపు ఉన్నాక ఎవ్వరూ తనకు అడ్డురారన్న నమ్మకం కల్గాకే ఈశ్వరయ్య తమ్మునికి పదివేల రూపాయల అప్పిచ్చాడు. యాదగిరి కూడా "అంతా నా భారం" అని ఈశ్వరయ్యకు మాటిచ్చాడు.

కన్నుమూసి తెరిలోగా ఓ సంవత్సరం గడిచిపోయింది. సోమయ్య ఆర్థిక పరిస్థితి ఇంకా దిగజారిపోయింది. వ్యవసాయం మీద పెట్టిన పెట్టుబడంతా వృథా అయిపోయింది. వర్షాలు కురవకపోవడంతో ఆ సంవత్సరం సోమయ్య పొలంలో కనీసం అతని కుటుంబానికి సరిపోయేటన్ని తిండిగింజలు కూడా పండలేదు. ఇంటి జాగాను తనపేర రిజిష్టర్ చెయ్యమని ఈశ్వరయ్య యాదగిరి ద్వారా తమ్మునికి కబురు చేశాడు. సోమయ్య ఇంకో ఆర్నెల్ల గడువివ్వమని కాళ్ళా వేళ్ళా పడ్డాడు. ఈశ్వరయ్య సరేనన్నాడు. ఆ ఆర్నెల్లు కూడా గడిచిపోయాయి. మరో ఆరునెలలు గడువు కోరాడు. అలా సోమయ్య ఒక ఆరు నెలల నుండి మరో ఆరునెలలకు ఆరు సార్లు గడువు కోరాడు. అలా మూడు సంవత్సరాలు గడిచిపోయాయి.

ఆ ఊరిని మండల కేంద్రంతో కలుపుతూ కొత్తగా రోడ్డు వేశారు. ఇదివరకు మట్టిరోడ్డు మాత్రమే ఉండేది. దాన్నిప్పుడు పక్కా తారురోడ్డుగా మార్చారు. తారురోడ్డు యేర్పడటంతో ఆ ఊరికి ఆర్టీసీ బస్సొచ్చింది. ఆరోడ్డు గుండా రోజూ బోల్డు ఆటోలు, జీపులు తిరగటం ప్రారంభమైంది. ఆ రోడ్డు ఈశ్వరయ్య ఇంటిముందటినుండే, సోమయ్య ఇంటిజాగా పక్కనుండే వెళ్లడం, అక్కడే బస్సు స్టాపును కూడా యేర్పర్చడంతో సోమయ్య ఇంటి జాగాకు చాలా డిమాండ్ యేర్పడింది. యాదగిరితో సహా ఆ ఊర్లో ఉండే కొందరు పెద్దమనుషులు సోమయ్య చుట్టూ చేరారు.

"పదివేలకు ఆ ఇంటిజాగాను మీ అన్నకు రిజిష్టర్ చెయ్యొద్దు... 50 వేలివ్వమని అడుగు. అట్టయితెనే నీ జాగా నీ అన్నకు రిజిష్టర్ చేస్తానను" అని చెప్పడం మొదలెట్టారు. యాభై వేలొస్తే తన అప్పుల్లో చాలాభాగం తీరిపోతాయని సోమయ్య సంబరపడ్డాడు. అందుకే అతనికా సలహా బావుందనిపించింది.

ఓ రోజు సోమయ్య యాదగిరితో "మా అన్న దగ్గరికి బోయి ఈ మాట చెప్పిరా. యేమంటడో చూద్దాం" అన్నాడు.

"యే మాట?" అన్నాడు యాదగిరి.

"ఆయనిచ్చిన అప్పుగాక ఇంకో యాభై వేలిస్తేనే నేను నా ఇంటి జాగాను ఆయన పేర రిజిష్టర్ చేస్తానని చెప్పు" అన్నాడు సోమయ్య.

"ఈ మాట వింటే మీ అన్న తోక తొక్కిన తాచుపాములా లేస్తడేమొ"

"లేస్తే లేచిండు... నువ్వైతే చెప్పిరా... ఆయన దగ్గర్నించి నువ్వు యాభైవేలు వసూలు చేసుకొస్తే దాంట్లోనుంచి నీకో ఐదువేలిస్త" అన్నాడు సోమయ్య.

"గట్లన్నవు బాగుంది... ఆరు నూరైనా, నూరు ఆరైనా నేను మీ అన్న దగ్గర్నుంచి యాభైవేలు వసూలు జేసుకొస్త" అంటూ ప్రతిజ్ఞ చేసి యాదగిరి లేచాడు.

యాదగిరొచ్చి ఈశ్వరయ్యకీ మాట చెప్పాడు "రోడ్డొచ్చింది కాబట్టి డిమాండ్ పెరిగింది. మీరిచ్చిన అప్పుపోగా యాభై వేలివ్వడం న్యాయమే" అన్నాడు.

"నాకు వాని జాగ యేమొద్దు. నా పైసలు నాకియ్యమను. వడ్డీతో కలుపుకొని 20 వేలయ్యింది" అన్నాడు ఈశ్వరయ్య.

"20 వేలయ్యిందా?" ఆశ్చర్యం నటించాడు యాదగిరి.

"మూడు పైసల మిత్తితోటి లెక్క జెయ్యి. ఎంతయితదో చూడు" అన్నాడు ఈశ్వరయ్య.

"గీ రోజుల్ల మూడు పైసల మిత్తి ఎవరిస్తున్నరు హెడ్‌మాస్టర్‌గారూ!" అన్నాడు యాదగిరి.

"అప్పుడు కాగితం నువ్వే రాసినవు గద... యేమని రాసినవో ఓసారి చదువు"

"నేనే రాసిన గని అప్పటికి ఇప్పటికి పరిస్థితులు చానా మారినయి గదా!"

"నువ్వు గిట్ల డబుల్ గేమ్ ప్లే జేస్తవని నేనూహించలేదు... నువ్వు ఊర్లె పెద్దమనిషివి గద... న్యాయానికి నిలబడ్తవనుకున్న"

"న్యాయానికే నిలబడ్త" అంటూ యాదగిరి లేచి వెళ్ళిపోయాడు.

ఈశ్వరయ్య ఆ ఊరి సర్పంచ్ వెంకటయ్యను సంప్రదించాడు.

"మంచి మాటలతోటి లాభంలేదు హెడ్‌మాస్టర్ గారూ! రేపే మీరా జాగాను ఆక్రమించుకోండ్రి... చుట్టు కాంపౌండ్ వాల్ కట్టించుకోండ్రి. ఎవడడ్డమొస్తడో చూద్దాం" అన్నాడు వెంకటయ్య.

ఆ మర్నాడే ఓ 20 మంది కూలీలను బెట్టి ఈశ్వరయ్య తన ఇంటి ముందున్న నాలుగ్గుంటల సోమయ్య ఇంటి జాగా చుట్టు కాంపౌండ్ వాల్ నిర్మించడం

మొదలెట్టాడు. అక్కడికి దగ్గర్లోనే ఉన్న సోమయ్యకు ఈ వార్త తెలియగానే భార్యాపిల్లల్ని వెంటబెట్టుకొని నెత్తినోరూ బాదుకుంటూ వచ్చాడు.

"నేను పేదోణ్ణి... మా అన్న అన్యాయంగ నా ఇంటిజాగా దౌర్జన్యంచేసి గుంజుకుంటున్నడు" అంటూ లబోదిబోమని గుండెలు బాదుకోవడం మొదలెట్టాడు.

"సోమయ్య భార్య "ఇదేం అన్యాయంరా దేవుడో!... ఇదేం పోయే కాలంరా నాయనో..." అంటూ ఊరంతా దద్దరిల్లిపోయేలా శోకాలు పెట్టడం మొదలెట్టింది. సోమయ్య ముగ్గురు పిల్లలు కూడా పెద్దగా యేడ్వటం మొదలెట్టారు. వాళ్ళు చేస్తున్న లొల్లి ఊరంతా వినిపించింది. ఊరు ఊరంతా అక్కడికి పరిగెత్తుకొని వచ్చారు.

ఎవరిష్టమొచ్చినట్టుగా వాళ్ళు మాట్లాడటం మొదలెట్టారు.

"పైసలున్నోనిదే రాజ్యం" అని కొందరు, "తోడబుట్టిన తమ్మునికే గింత అన్యాయం జేస్తరా" అని కొందరు.

"ఆయనకు సర్కార్ నౌకరీ ఉన్నంక గీ కాసింత భూమి లేకపోతేంది" అని కొందరు.

"అప్పిచ్చింది స్వంత తమ్మునికే గద... అన్న సొమ్ము తమ్ముడు తింటేంది" "తమ్ముడు గరీబోడు గదా... అన్న బలిసినోడు గద... అయ్యో పాపం అనుకొని మాఫీ చెయ్యొచ్చు గద... 50 వేలు ఖరీదు చేసే భూమిని పదివేలకే తీసుకునుడు ఎంత అన్యాయం... రెండు చేతులా బోలెడు ఆస్తి సంపాయించిండు గద... పోయేటప్పుడు కొంచబోతడా" "తమ్ముడయితేంది - అన్నయితేంది. అప్పు తీసుకున్నంక ఇయ్యాలె గద"

అక్కడికొచ్చిన జనమంతా ఇట్లా రకరకాలుగా మాట్లాడుతోంటే సోమయ్య భార్య ఇంకా విజృంభించింది.

ఈశ్వరయ్యనూ, ఈశ్వరయ్య భార్యనూ, పిల్లల్ని పచ్చిబూతులు తిట్టడం మొదలెట్టింది.

"మా సొమ్ము తిన్నోడు పురుగులుపడి ఛస్తడు... వాని పెండ్లాం ముండమోస్తది. వాని పిల్లలకు గత్తరొచ్చి చస్తరు... వానింట్ల పీనిగెల్తది... వానిల్లు కాలిపోతది. కూలిపోతది... వాడు పెడాల్న ఛస్తడు. వాని మొఖాన మొద్దులు పెద్తరు... వాని మొల్తాడు తెంపుతరు... వాని పెండ్లాం చేతుల బెల్లం పెడ్తరు. వాని పెండ్లాం కడుపు కాల్తది" రాగయుక్తంగా శోకాలు పెడ్తూ సోమయ్య భార్య ఊరంతా వినిపించేలా ఈ తిట్లన్నీ తిట్టడం మొదలెట్టింది.

ఆమె తిడ్తున్న తిట్లు వింటోంటే ఇంట్లో ఉన్న ఈశ్వరయ్య భార్య సునంద తనకు ఎలక్ట్రిక్ షాక్స్ ఇస్తున్నట్టుగా ఫీలయ్యింది. ఆ క్షణంలో తన ప్రాణంపోతే బావుండుననిపించింది. అవమానభారంతో ఆమెతల పగిలిపోతుందేమొ ననిపించింది.

అంత గొడవ జరుగుతున్నా కాంపౌండ్ నిర్మాణం ఆగలేదు.

ఊర్లో ఉన్న పెద్ద మనుషులంతా వచ్చి ఈ దృశ్యాన్ని చూశారు. సోమయ్య, అతని భార్య, అతని పిల్లలు చేస్తున్న లొల్లిని వినోదం చూస్తున్నట్టుగా చూశారు. కానీ ఎవ్వరూ కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని ఆపలేకపోయారు. చివర్లో మాజీ సర్పంచ్ దొడ్డరామయ్య వచ్చి సోమయ్యను తన దగ్గరకు పిలిపించుకున్నాడు. అతనితో యాదగిరి కూడా ఉన్నాడు.

సోమయ్య, అతని భార్య లక్ష్మమ్మ-ఇద్దరూ వెళ్ళి దొడ్డరామయ్య కాళ్ళమీద పడ్డారు. నెత్తీ నోరూ బాదుకున్నారు. "నన్ను రక్షిస్తానంటే తప్ప మీ కాళ్ళు వదిలిపెట్టం" అన్నారు.

"ఇది ఊరా? అడివా? మీ జాగా చుట్టు ఆయనెట్ల కాంపౌండ్ కడ్తడు? తెల్లారేటొరకు మీ జాగాల మీరో గుడిసేసుకొని దాంట్లెనె ఉండుండ్రి... ఎవడన్నా అడ్డమొస్తె నాకు చెప్పుండ్రి" అన్నాడు మాజీ సర్పంచ్ దొడ్డ రామయ్య.

అంతే! తెల్లారేటప్పటికి ఆ జాగాలో ఓ గుడిసె ప్రత్యక్షమయింది. సోమయ్య కుటుంబం వచ్చి ఆ గుడిసెలో కాపురం పెట్టింది. కాంపౌండ్ వాల్‌ను చాలాచోట్ల కూలగొట్టారు. దొడ్డరామయ్య మనుషులు చాలా మందొచ్చి సోమయ్యకు అండగా నిల్చారు. వాళ్ళు చేస్తున్న పనిని ఆపమని తన మనుష్యులను పంపిస్తే పెద్ద కొట్లాట జరుగుతుంది. తలలు పడుల్తాయి. ప్రభుత్వోద్యోగిగా తను ఇట్లాంటి కొట్లాటలకు కారణం కాకూడదు అనుకొని ఈశ్వరయ్య వెళ్ళి పోలీసు రిపోర్టిచ్చాడు.

పోలీసులొచ్చారు. ఆ జాగా తనదేనని ఈశ్వరయ్య రుజువు చెయ్యలేక పోయాడు.

ఇంకో ఆరు నెలల్లో తన అన్న దగ్గర అప్పుగా తీసుకున్న డబ్బు చెల్లిస్తానని సోమయ్య పోలీసులతో చెప్పాడు. అట్లా చెయ్యకపోతే ఈశ్వరయ్య కోర్టుకెళ్తాడని పోలీసులు సోమయ్యకు వార్నింగ్ ఇచ్చి వెళ్ళిపోయారు.

ఆ ఆరునెలల్లో మరికొన్ని మార్పులు జరిగాయి. ఆ వేసవిలో రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఇదివరకు అధికారంలో ఉన్న పార్టీ ఓడిపోయింది. అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న బక్కరైతులను ఆదుకుంటామని వాగ్దానం చేసిన పార్టీ

గెల్చింది. దాంతో ప్రతి గ్రామంలోనూ రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. తొమ్మిదేళ్లుగా గ్రామాల్లో అధికారం చెలాయిస్తున్న పెత్తందార్ల మొఖాలు తెల్లమొఖాలయ్యాయి. ప్రతిపక్షంలో ఉన్న దొడ్డరామయ్యలాంటి మాజీ పెత్తందార్ల మొఖాలు వెలిగిపోయాయి.

"ఈ ఆర్నెల్లు కూడా గడిచిపోయాయి గదా – నా బాకీ తీరుస్తవా?... లేదా? నన్ను కోర్టుకు పొమ్మంటవా?" అంటూ ఈశ్వరయ్య తమ్మునికి కబురు చేశాడు.

"కోర్టుకు పోతే ఆయనకు నువ్వు రాసిచ్చిన పత్రం చెల్లదు. నువ్వు గమ్మునుండు. ఆయన నిన్నేం చెయ్యలేడు" అన్నాడు దొడ్డ రామయ్య.

"వరుసగా మూడేళ్ళు వర్షాలు లేకపోవడం వల్ల నా పరిస్థితి దిగజారి పోయింది. ఇంకో యేడాది ఆగితే నీ బాకీ చెల్లిస్తా"నన్నాడు సోమయ్య.

"యేడాది కాదు... ఒక్కరోజు కూడా ఆగేది లేదు" అన్నాడు ఈశ్వరయ్య. అన్నాడే గాని తమ్ముని దగ్గర్నుంచి డబ్బుల్ని ఎలా రాబట్టాలో అతనికర్థం కాలేదు. పత్రం రాసిన యాదగిరి సోమయ్యవైపే ఉన్నాడు.

"వాళ్ళారోజు మనల అన్ని తిట్లు తిట్టింద్రు గద – వాళ్ళను మనం మల్లా అన్ని తిట్లు తిట్టించాలె... మనూర్లె ఓ వెయ్యి రూపాయలిస్తే వీళ్ళను బండబూతులు తిట్టిపోయేటోళ్ళున్నరట... నిన్ననే మన జీతగాడు కొమురదు చెప్పిండు – గాపని జేసినంకనే మనం కోర్టుకు పోదాం... వాన్ని జైళ్ళ పెట్టిద్దాం" అంది తల పట్టుకొని ఆలోచిస్తున్న భర్త ఈశ్వరయ్యతో అతని భార్య సునంద.

ఈశ్వరయ్యకు ఆమె సలహా బాగానే ఉందనిపించింది. యేది యేమైనా ఆరోజు వాళ్ళు తిట్టిన తిట్లకు ప్రతీకారం తీర్చుకోవాలి. వాళ్ళ దగ్గర జీతమున్న కొమురయ్యకు ఆ ఊర్లో మంచి పట్టుంది. అతనుండే వాడకు అతడే నాయకుడు. ఆ రాత్రి ఈశ్వరయ్య అతన్ని పిల్చాడు.

"ఆరోజు వాడు, వాని భార్య నన్నూ నా భార్యనూ తిట్టిన తిట్లు నీకు గుర్తున్నయి గద... వాళ్ళను మేమట్ల తిట్టలేంగద..." అన్నాడు ఈశ్వరయ్య.

"మీరెందుకు తిడ్తరయ్యా... ఓ వెయ్యి రూపాయలు మా మొఖాన పడేసి మీరు యేమీ ఎరగనట్టే తలుపులు పెట్టుకొని మీ ఇంట్ల పండుకోండ్రి... నేను మా వాడోళ్ళను తీసుకొచ్చి వాళ్ళను తిట్టిపిస్త... మా తిట్లు ఎట్లుంటయో మీకెరికలేదా... ఆ తిట్లు తిన్నంక వాడూ, వాని పెండ్లాం ఉరిపోసుకొని చావాలె... గట్లాంటి తిట్లు తిడ్తం" అన్నాడు కొమురయ్య.

ఈశ్వరయ్య కొమురయ్యకు వెయ్యి రూపాయలిచ్చేశాడు.

ఆ మర్నాటి రాత్రి కొమురయ్య తన వాడలో ఉంటున్న ఓ ఇరవై మందిని సోమయ్య గుడిసె దగ్గరకు తీసుకొచ్చాడు... వాళ్ళల్లో చాలామంది చిత్తుగా తాగారు.

సోమయ్యానూ, సోమయ్య భార్యనూ వాళ్ళు తిట్టడం మొదలెట్టారు. వాళ్ళు తిట్టే తిట్లు ఆ ఊరంతా వినిపించసాగాయి...

"నీకు సిగ్గూ, శరం లేదురా... అన్న దగ్గర పైసలు దీసుకొని ఎగ్గొడ్తావురా లుచ్చా..." ఈ ధోరణిలో వాళ్ళు ఆ రాత్రంతా రాయడానికి వీలుకాని పచ్చిబూతులు తిట్టారు. వాళ్ళు తిడ్తున్న తిట్లన్నీ ఈశ్వరయ్యకూ అతని భార్యకూ వినిపిస్తూనే ఉన్నాయి. నీచాతినీచమైన తిట్లు తిట్టి తెలతెలవారుతుండగా వాళ్ళందరూ సోమయ్య గుడిసె దగ్గర్నుండి వాళ్ళ వాడకు వెళ్ళిపోయారు.

సోమయ్యకూ సోమయ్య భార్యకూ అంత ఘోరాతిఘోరమైన, నీచాతినీచమైన తిట్లు తిన్నాక కూడా ఇంకా ఎందుకు బతికున్నారో అర్థం కాలేదు. తెల్లారేటప్పటికి వాళ్ళిద్దరూ జీవచ్ఛవాలుగా మారిపోయారు...

రాత్రి యేం జరిగిందో తెలుసుకున్న యాదగిరి జాము పొద్దెక్కాక సోమయ్యింటికొచ్చాడు.

యాదగిరి మీద పడి సోమయ్య భోరున యేడ్చాడు. సోమయ్య భార్య "అన్నా! యాదగిరన్న... మా బావ మమ్ముల లేబర్ జనంతోటి గీనర్లోకంల ఎవ్వరూ వినని కనని బేఇజ్జత్ తిట్లు తిట్టిపిచ్చిండు... ఇగ మేమిద్దరం ఉరిపెట్టుకొని చస్తం... గట్లాంటి తిట్లు తిన్నంక మేం బతకొద్దు... యాదికొస్తె వొంటికి ముండ్లొస్తున్నయి. మేం బతకొద్దు యాదగిరన్న... బతకొద్దు... ఊరిబెట్టుకొని చస్తం... మా ఉసురు వానికి తగలాలె... పైసలున్నయని మురుస్తున్నడు... పొత్తుల పైసల్తోటే వాన్ని చదివిస్తిమి... గా చదువుతోటే వానికి కొలువు దొరికె... వాని కొచ్చే జీతాన్ని వీళ్ళ నల్గురన్నదమ్ములు పంచుకోవాలె... కని వాడొక్కడే తిన్నడు... నౌకరి జేస్తున్నవు కాబట్టి నీకు పొత్తుల భూమిల పాలు లేదన్నం... అయినా వాడు మా తోటి సమానంగ భూమిల పాలు తీసుకున్నడు. అటు నౌకరి... ఇటు వ్యవసం జేసుకుంట... చాలా పెద్దోడయిపాయె... బంగ్లాగట్టె... కొడుకులను, బిడ్డలను పెద్ద చదువులు చదివించుకునె... అయినా వానికి సరిపోలె... మేం కష్టంల ఉన్నప్పుడు ఓ పదివేల రూపాయలియ్యమన్నం... ఇచ్చిండు... వాడిచ్చింది మా సొమ్మేకదా... పొత్తుల సొమ్ముతోటే పైకొచ్చిండు గద... పదివేలకు అడ్డగోలుగ వడ్డీ గట్టి యాభై వేలు ఇయ్యమంటడా? యాభై వేల ఇంటిజాగాను కాజెయ్యాల్నని

జూస్తడా?... ఎంతన్యాయం! మేం ఇంటి జాగా ఇయ్యమన్నందుకు, మా ఇంట్లో మేం ఓ గుడిసేసుకుంటే మమ్ముల లేబరోళ్లతోటి బేఇజ్జత్ తిట్లు తిట్టిపిస్తడా... వాడు గత్తరొచ్చి చస్తడు... వాన్ని కాటికి దీసుకపోతరు. వాన్ని కాలేస్తరు. వాని పెండ్లం ముండమోస్తది. వాని కొడుకులు బిడ్డలు... అందరు చస్తరు... వానిల్లు కాష్టాలగడ్డయితది" రాత్రి వాళ్ళెన్ని తిట్లు తిట్టారో సోమయ్య భార్య మళ్ళీ అన్ని తిట్లు తిట్టింది.

యాదగిరి ఆమె తిట్టే తిట్లు వింటూనే ఆలోచించడం మొదలెట్టాడు.

"సోమయ్య! నేనో ఉపాయం చెప్త... చేస్తవా?" అన్నాడు యాదగిరి.

"నీ మాట ఎప్పుడు విన్లేదే యాదగిరన్న... చెప్పు" అన్నాడు సోమయ్య.

"కొత్త ప్రభుత్వం వచ్చింది. ఇది మన ప్రభుత్వం... మనసుంటి బక్కరైతులను ఆదుకుంటమని వాగ్దానం చేసిన ప్రభుత్వం. ఇదివరకు అప్పులపాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కని ఈ ప్రభుత్వం ఆత్మహత్యలను ఆపుతమంటున్నది. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు లక్ష రూపాయలిస్తమని ప్రకటించింది. రైతులను అప్పులు చెల్లించమని వొత్తిడి చేసిన వాళ్ళను, దౌర్జన్యం చేసిన వాళ్ళను వెంటనే అరెస్టు చేసి జైళ్ళ పెడ్తున్నది..."

"వాడు... ఆ హెడ్‌మాస్టర్‌గాడు జైలుకుబోవాలె... అది నేను చూడాలె... అప్పుడుగని నా పగ చల్లార్తది" అంది లక్ష్మమ్మ.

"నీ పగ చల్లారాల్నంటే నీ మొగుడు ఆత్మహత్య చేసుకోవాలె" అన్నాడు యాదగిరి.

"చేసుకుంటడు... కొమురయ్య వాడోల్ల తోటి గన్ని తిట్లు తిన్నంక గాయన బతికేం లాభం... లెక్కలేని అప్పులు జేసి వ్యవసం మీద బెట్టె... కొత్త విత్తనాలనె... ఎరువులనె... పురుగుమందులనె... పైసలన్ని మట్లెబోసె... వానలు పడవాయే... పెట్టిన పెట్టుబడంతా నాశనమైపాయె... ఉన్న భూమంతా కుదువబెట్టే... అప్పులు తడిసిముప్పందుం అయిపాయె... గా అప్పుల కింద మాకున్న భూమంతా పోతది. ఈన చస్తె లక్ష రూపాయలొస్తయి... నా పిల్లలన్న బతుకుతరు... మమ్ముల గలీజు తిట్లు తిట్టిచ్చినోడు జైలుకుబోతడు... చస్తడు... నా మొగుడు కూడ చస్తడు... ఉరిపెట్టుకోని చస్తడు... నేను ముండమోసినా ఫరవలేదు... కని ఈన చావాలె... చావాలె..." అంటూనే లక్ష్మమ్మ భోరున యేడ్వసాగింది.

"నేను ఇంకో ఉపాయం చెప్త... నువ్వు నిజంగ చావొద్దు... ఆత్మహత్య చేసుకున్నట్టు నాటకమాడాలె. అప్పు తీర్చలేదని మీ అన్న నిన్ను బేఇజ్జత్ తిట్లు తిట్టించిండని, గందుకే ఆత్మహత్య చేసుకుంటున్ననని నువ్వు ఎమ్మార్వోకో ఉత్తరం రాసిపెట్టు. కొంచం... కొంచెమంటే కొంచెమే పురుగుమందు కలుపుకొని అన్నంతిను... కొంచెం సేపట్లనే స్పృహ తప్పి పడిపోతవు... నేను మండలకేంద్రంల ఉన్న హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్త... పోలీసులొస్తరు... నిన్ను దవాఖాన్ల షరీఖుజేపిస్తరు... నువ్వు మింగిన విషాన్ని కక్కిస్తరు... నువ్వు బతుకుతవు... నువ్వు రాసిన ఉత్తరం జూసి మీ అన్నను అరెస్టు జేసి జైళ్ళబెడ్తరు" అన్నాడు యాదగిరి.

"లక్ష రూపాయలొచ్చినా రాకపోయినా ఆత్మహత్య జేసుకోబోయిండు కాబట్టి నీ మొగుడు చేసిన అప్పులన్నీ మాఫీజేస్తరు... నీ మొగున్ని అప్పులు తీర్చమని ఎవ్వడడిగినా వాన్ని జైళ్ళబెడ్తరు...గట్ల నీ మొగుడు జేసిన లక్ష రూపాయల అప్పులు తీరిపోతయి..." అన్నాడు యాదగిరి.

"గీ ఉపాయం బాగనే ఉంది..." అంది లక్ష్మమ్మ.

"సోమన్నా! జర్ర పదిలం... పురుగుమందు చానా కొద్దిగ గలుపుకో" అన్నాడు యాదగిరి.

"గట్లనేగని... ఎమ్మార్వోకు యేం రాయాల్నో నువ్వే రాయి... నేను దస్తకత్ పెడ్త" అన్నాడు సోమయ్య.

"సాయంత్రం వరకు రాసుకొస్త... గీ సంగతి మన మాజీ సర్పంచి దొడ్డ రామయ్యకు్కాడ చెప్త... వాళ్లింట్ల ఫోనున్నది... నువ్వు పురుగుమందు తాగంగనే నేను మండలాఫీసులో ఉన్న హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్త... నిన్ను వెంటనే దవాఖానకు తీసుకపోతరు. నిన్ను బతికిస్తరు..."

"అంత నీ దయ. నేను బతికి బట్టకట్టి నా అప్పులన్ని తీర్తే నీ రుణం ఉంచుకోను." అన్నాడు సోమయ్య.

"గదంత తర్వాత చూసుకుందాంలే" అంటూ యాదగిరి వెళ్ళిపోయాడు.

* * *

సోమయ్య ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త తెలతెలవారుతుండగా ఊరంతా గుప్పుమని వ్యాపించింది. తండోపతండాలుగా జనం సోమయ్యింటికి చేరారు. సోమయ్య స్పృహ తప్పి పడిపోయాడు. అతని నోట్లోంచి వెలువడిన నురుగులు అతని మొఖమంతా వ్యాపించాయి. అతడు చాలా భయంకరంగా కనిపించాడు.

యాదగిరి హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేశాడు. మండల కేంద్రం ఆ ఊరికి పది కిలోమీటర్ల దూరంలో ఉంది. యాదగిరి ఫోన్ చేసిన సమయంలో ప్రైమరీ హెల్త్ సెంటర్లో ఎవరూ లేరు. ఇటు పోలీసులు, అటు ప్రైమరీ హెల్త్ సెంటర్ వాళ్లు కలుసుకొని అంబులెన్స్‌తో ఆఊరు చేరుకునేటప్పటికి చాలా గంటలు గడిచిపోయాయి.

ఈలోగా సోమయ్య ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

పోలీసులొచ్చి ఈశ్వరయ్యను అరెస్టు చేసి లాకప్‌లో వేశారు.

సోమయ్య శవం మీద పడి అతని భార్య, పిల్లలు చూసేవాళ్ళ గుండెలు ద్రవించేలా రోదించారు.

"నా ప్లాన్ ఎక్కడ బెడిసికొట్టి ఉంటుంది" అని యాదగిరి ఆలోచించడం మొదలెట్టాడు. "మనం కేవలం నిమిత్తమాత్రులం. అంతా రాసిపెట్టినట్టు జరుగుతుంది. సోమయ్య అనేవాడు గీదినం గిట్ల చావాల్నని దేవుడు ఎప్పుడో రాసిపెట్టిండు... గందుకే చచ్చిండు.... దీంట్లె మనం జేసిన తప్పేంలేదు..." అని తన అంతరాత్మను ఓదార్చుకున్నాడు యాదగిరి.

- 'వార్త' ఆదివారం ***19-02-2006, 26-02-2006***

కథా నిలయం
శ్రీకాకుళం